

ఐటీఐ.. సత్వర ఉపాధి..!
పారిశ్రామిక శిక్షణ నైపుణ్యం కలిగినవారికి ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తక్కువ సమయంలో స్థిరపడేందుకు ఐటీఐ చక్కని అవకాశం కల్పిస్తోంది. 8లో▸



అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /26.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జాతీయ కోచింగ్ క్యాంపునకు విద్యాసాగర్


విద్యాసాగర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ గిరిజన క్రీడా బాలికల పాఠశాల అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ జాతీయ అథ్లెటిక్ కోచింగ్ క్యాంపునకు శిక్షకుడిగా ఎంపికైనట్లు డీటీడీవో రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా బోపాల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఈ నెల 6నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ అథ్లెటిక్స్ కోచింగ్ క్యాంప్‌నకు శిక్షకుడిగా విద్యాసాగర్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యాసాగర్‌ను డీఎస్వో, ఏసీఎంవో పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సింగరేణి పాఠశాలలో అడ్మిషన్ల స్వీకరణ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం బోధన అందుబాటులో ఉందని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యా బోధన, వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒకటో తరగతిలో 15 సీట్లు, రెండో తరగతిలో 6, నాలుగో తరగతిలో 2, ఐదో తరగతిలో 8, ఎనిమిదో తరగతిలో 5, తొమ్మిదో తరగతిలో 10 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏరియాలోని ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమశాఖ సంచాలకుడు రవీంద్రనాయక్, డీఎంహెచ్‌వో తుకారాం, డీపీవో భిక్షపతితో కలిసి వైద్య సిబ్బంది, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో వ్యాధుల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ శుక్రవారం గ్రామాల్లో డ్రైడే నిర్వహించాలని పేర్కొన్నారు. మంచినీటి ట్యాంకులు, చేతిపంపులు, బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. సమావేశంలో సురేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్ష


రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విరమణ పేరిట తక్కువ డబ్బులు చెల్లించి జూలై 1వ తేదీ నుంచి తమను ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చెల్లిస్తూ వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిశీలించకుండా పక్కన పెట్టడం సరికాదని తెలిపారు. వారు వ్యతిరేకించిన జీవో10ని అమలు చేయాలని చూడడం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రజిత, ఇందిర, వినోదిని, రాజమ్మ, వనిత, సుశీల, కౌసల్య, కమలమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వసతి

- హాస్టళ్లలో వసతులు కరువు
- శిథిలావస్థలో మరుగుదొడ్లు
- వృథాగా శుద్ధజల యంత్రాలు
- నిర్వహణ లేని సోలార్ గీజర్లు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



ఆసిఫాబాద్‌రూరల్: ఫ్యాన్లు లేని పీటీజీ గురుకులంలోని హాస్టల్ గది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వివిధ హాస్టళ్లలో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులు నిత్యం ఇబ్బందుల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో 15 కేజీబీవీలు, మూడు మైనార్టీ గురుకులాలు, నాలుగు మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఐదు గిరిజన గురుకులాలు, 44 ఆశ్రమాలు, రెండు పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లున్నాయి. వీటిలో సుమారు 35వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలాచోట్ల వీరికి కనీస సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, కిటికీల తలుపులు లేక ఇబ్బంది పడుతున్నారు. మైనార్టీ, జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో సరిపడా తరగతి గదులు, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు లేవు. పీటీజీ గిరిజన గురుకుల పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరగగా వీరికి సరిపడా వసతులు పెంచలేదు. అదనపు గదుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేకుండా పోయింది. విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలురు, బాలికలు, బీసీ, ఎస్సీ వసతి గృహాల్లోనూ సమస్యలు తిష్టవేశాయి. జిల్లా కేంద్రంలో గిరిజన గురుకులం (పీటీజీ) పాఠశాలలో మూడో తరగతి నుంచి ఇంటర్ వరకు 720 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. కొత్త సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు ఒంటికి, రెంటికీ బయటికే వెళ్తున్నారు. పడుకునే గదుల్లో ఫ్యాన్లు లేక ఉక్కపోత, దోమలమోతతో ఇబ్బంది పడుతున్నారు. రోజూ చన్నీటి స్నానం చేస్తున్నారు.

తరగతి గదిలోనే నిద్రిస్తున్నాం



జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాలలో 880 మంది విద్యార్థినులం చదువుకుంటున్నాం. శిథిలావస్థలోని డార్‌మెట్రిక్ భవనం కూల్చివేసి మళ్లీ కొత్తది నిర్మించలేదు. దీంతో తరగతి గదిలోనే నేలపై నిద్రిస్తున్నాం. అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.
– అంజలి, తొమ్మిదో తరగతి

విరిగిన కిటికీలు.. పగిలిన డోర్లు


కౌటాల: పెచ్చులూడుతున్న హాస్టల్ భవనం పైకప్పు

కౌటాల: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు కూడా చేయడంలేదు. పైకప్పు వర్షానికి ఉరుస్తోంది. విద్యార్థుల బట్టలు, పుస్తకాలు, పెట్టెలు తడుస్తున్నాయి. గదుల కిటికీలు విరిగాయి. తలుపులు పగిలిపోయాయి. 3నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 100మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బెడ్లు లేక కింద పడుకుంటున్నారు. గదులు సరిపోవడం లేదు. చేతిపంపు నీటినే తాగుతున్నారు. చన్నీటి స్నానాలు తప్పడంలేదు. వంట చేయడానికి కుక్ లేక కామాటి సాయంతో వాచ్‌మన్ వంట చేస్తున్నాడు.

కుక్‌ను నియమించాలి



హాస్టల్‌లో వంద మందిమి ఉంటున్నాం. పడుకోవడానికి సరిపడా గదులు లేవు. భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు ఉరుస్తోంది. భవనానికి మరమ్మతులు చేయాలి. కుక్ లేక వాచ్‌మన్ వంట చేస్తున్నాడు. అధికారులు వెంటనే కుక్‌ను నియమించాలి. సమస్యలు పరిష్కరించాలి.
– గణేశ్, పదో తరగతి, కౌటాల

మిషన్ భగీరథ నీరే దిక్కు


పెంచికల్‌పేట్: ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో మరమ్మతుకు నోచుకోని సోలార్ సిస్టం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో 140 మంది విద్యార్థులు చదువుతున్నారు. బోరు నుంచి నీరు రాక విద్యార్థులు అన్ని అవసరాలకు మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడుతున్నారు. భగీరథ నీరు సరఫరా కాని రోజు చాలా ఇబ్బంది పడుతున్నారు. స్నానానికి వేడినీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ గీజర్ మరమ్మతుకు నోచుకోక చన్నీటి స్నానం తప్పడంలేదు.

కల్వాడలో ప్రమాదకరంగా పాతభవనం


దహెగాం: అపరిశుభ్రంగా వంటగది

దహెగాం: మండలంలోని కల్వాడ ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు ఉండగా 218 మంది విద్యార్థులు చదువుతున్నారు. మరుగుదొడ్లు సరిపడా లేవు. ఉన్నవి శిథిలావస్థకు చేరాయి. శుద్ధజల ప్లాంట్ ఉన్నా వినియోగంలోలేదు. విద్యార్థులు బోరు నీటినే తాగుతున్నారు. పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరగా అందులో ఓ గదిని వంట గదికి ఉపయోగిస్తున్నారు. పాత భవనాన్ని కూల్చివేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం పని చేయడం లేదు.

అధ్వానంగా పానపటార్ వంటగది


జైనూర్: పానపటార్‌లో శిథిల భవనం కింద భోజనం చేస్తున్న విద్యార్థులు

జైనూర్: మండలంలోని పానపటార్ బాలుర ఆశ్రమ పాఠశాల వంట గది అపరిశుభ్రంగా ఉంది. ఇందులో కుక్కలు పడుకుంటున్నాయి. ఇందులోనే ఏఎన్‌ఎంకు వసతి కల్పించడం గమనార్హం. శిథిల భవనం కింద విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోచంలొద్ది బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇక్కడ విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

బావి నీళ్లే దిక్కు


తిర్యాణి: విద్యార్థులకు తాగునీరు అందించే బావి ఇలా..

తిర్యాణి: మండలంలోని పంగిడిమాదర లోగల గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలుర)లో 119 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మౌలిక సదుపాయలు లేక వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. తాగునీటికి ఇంకా బావి నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. శుద్ధజలం యంత్రం నిర్వహణ లేక నిరుపయోగమైంది. వేడినీటి కోసం ఏర్పాటు చేసిన సోలార్ గీజర్ పరిస్థితీ అంతే.. ఏ కాలంలోనైనా విద్యార్థులకు చన్నీటి స్నానాలు తప్పడంలేదు.

'ఐటీడీఏ ఆశ్రమం'లో అన్నీ సమస్యలే..

రెబ్బెన: మండలంలోని గోలేటి విలేజ్‌లోగల ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అరకొర సౌకర్యాల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు సుమారు 130 మంది చదువుతున్నారు. ఐదు బాత్‌రూంలు, ఐదు మరుగుదొడ్లు ఉండగా ఒక్కటీ వినియోగానికి పనికిరాదు. ఐటీడీఏ వల మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి తలుపులు బిగించినా కొద్దిరోజులకే ఊడిపోతున్నాయి. బాత్‌రూంల తలుపులు శిథిలావస్థకు చేరాయి. ఆర్వో ప్లాంట్ ఉన్నా తరచూ పాడవుతుండగా విద్యార్థులు బోరు నీరే తాగుతున్నారు. డార్మెంటరీలో పూర్తిస్థాయిలో ఫ్యాన్లు, లైట్లు పని చేయటం లేదు. మూడేళ్లుగా పరుపుల సరఫరా లేక పీచు ఊడిపోతున్నా పాతవాటినే వాడుతున్నారు. ఈ ఏడాది ఇంకా బెడ్‌షీట్లు అందించలేదు. అధునాతన వంటసామగ్రి నిరుపయోగంగా ఉంటోంది. రాత్రివేళ వార్డెన్, ఉపాధ్యాయులెవరూ అందుబాటులో ఉండటం లేదు.


రెబ్బెన: ఊడిపోతున్న మరుగుదొడ్ల తలుపులు

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు


గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న పీవో

తిర్యాణి: విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల (బాలికలు)తో పాటు ఆశ్రమ బాలుర పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు మండలంలోని 30 పడకల ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఫార్మసీలో సకాలంలో మందులు ఉంచనందుకు గాను ఫార్మసిస్ట్‌తో పాటు పీవో ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను ఐటీడీవోకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న రవీందర్‌నాయక్

రెబ్బెన(ఆసిఫాబాద్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. పరిసరాలు, లేబర్‌రూం, ఐఎల్‌ఆర్, ల్యాబ్, వార్డులు, మెడిసిన్ స్టోర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రైడేను పకడ్బందీగా నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో నెలకొన్న సిబ్బంది కొరత తీర్చాలని ఈ సందర్భంగా సిబ్బంది డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీలో ఒకే ఒక్క వైద్యాధికారి పోస్టు ఉండటంతో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యసేవలు అందించటం కష్టమవుతోందని తెలిపారు. అదనంగా ఇద్దరు డాక్టర్లను నియమించాలని, ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయాలని, సరిపడా ఫీల్డ్ స్టాఫ్‌ను నియమించాలని హెల్త్ డైరెక్టర్‌ను కోరారు. అనంతరం హెల్త్ డైరెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యదర్శి కిషన్, డీఎంహెచ్‌వో తుకారాం, పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి


క్రీడాకారులతో ఆర్‌సీవో గంగాధర్

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆర్‌సీవో గంగాధర్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–13 బాలికల ఫుట్ బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుడాలన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ప్రతిభ కనబర్చిన 20 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 12నుంచి 14 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, కోచ్‌లు రవి, అనిత, తిరుమల్, అరవింద్, రాకేశ్, చిన్నక్క తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో విద్యాబోధన చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఆర్డీవో సురేందర్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపడుతున్న పనుల గురించి తెలుసుకున్నారు. ప్రతీ పాఠశాలలో కరెంట్, తాగునీటి సరఫరా పనులు 100 శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగతా పనులు త్వరలో పూర్తి చేయిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు.

బొగ్గు బ్లాకుల వేలంపై భగ్గుమన్న సంఘాలు



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు చర్యలు చేపట్టడంతో సింగరేణిలోని కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాటపట్టాయి. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్, హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘాలు వేర్వేరుగా ధర్నా నిర్వహించి ఇన్‌చార్జి జీఎం నరేందర్‌కు వినతిపత్రాలు అందజేశాయి. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణికి బొగ్గుబ్లాకులను కేటాయించకుండా సంస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. లక్షలాది మందికి అన్నం పెడుతున్న తల్లిలాంటి సింగరేణిని కాపాడుకునేందుకు ఉద్యోగులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. జెండాలకు అతీతంగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వాలపై పోరాడాలని కోరారు. టీబీజీకేఎస్ నాయకులు మంగీలాల్, కిరణ్, వెంకటేశ్, సంపత్, సమ్మయ్య, చంద్రశేఖర్, మహేందర్, హెచ్‌ఎంఎస్ నాయకులు ఎండీ గౌస్, శంకర్, ఎస్‌కే ఇనూస్, శ్రీనివాస్, ఆరీఫ్, కిష్టస్వామి, బాలేశ్, దీపక్‌రాజ్, రాజేశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం



చిన్నారిని చూపిస్తున్న సిబ్బంది

కోటపల్లి: వేమనపల్లి మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన మంథని పుష్పకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా కోటపల్లి మండలంలోని మల్లంపేట సమీపంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ షబాజ్, పైలట్ సతీశ్ చికిత్స అందించగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యంకోసం చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాత్కాలిక రోడ్డుతో ఇబ్బందులు



బురదలో దిగబడిన ఎరువుల లారీ

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట, పార్పల్లి గ్రామాల మధ్య లోత్రై వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగా వాహనాలు వెళ్లేందుకు మట్టితో తాత్కాలిక రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారింది. శనివారం ఎరువుల లోడుతో వెళ్తున్న లారీ బురదలో దిగబడి పోవడంతో అటుగా వచ్చిపోయే 12 గ్రామాల ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. అత్యవసర నిమిత్తం అటుగా వెళ్తున్న అంబులెన్స్ కూడా బురదలో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని 12 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు చెల్లించాలని శనివారం నిరసన చేపట్టారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పస్తులతో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

టిప్పర్ ఢీకొని లేగదూడకు గాయాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లేగదూడకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై సంచరిస్తున్న లేగదూడను టిప్పర్ ఢీకొనడంతో రెండుకాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గమనించిన స్థానికులు పశువైద్యునికి సమాచారం అందించారు. ఇదిలా ఉంటే రోడ్డుపై పశువులు రాత్రింబవళ్లు సంచరిస్తూ రోడ్డుకు అడ్డంగా ఉంటున్నా యి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పశువుల యజమానులు వాటిని ఇళ్లకు తీసుకెళ్లేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐ..సత్వర ఉపాధి..!



మంచిర్యాలలోని ఐటీఐ కళాశాల

- మొదటి దఫాలో 124 సీట్లు భర్తీ
- రెండో దఫా అడ్మిషన్లకు నోటిఫికేషన్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 15 తుదిగడువు
- ఏటీసీ భవనాలు పూర్తయితే ఆరు కొత్త కోర్సులు

మంచిర్యాలఅర్బన్: పారిశ్రామిక శిక్షణ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు తలుపుతడుతున్నాయి. తక్కువ సమయంలో కొలువులు సాధించి స్థిరపడాలనుకునే యువతకు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) చక్కని అవకాశం కల్పిస్తోంది. మరోవైపు ప్రభుత్వం ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఐటీఐల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలకు కార్యాచరణ రూపొందించింది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. భవన నిర్మాణ పనులు పూర్తయితే ఈ ఏడాది నుంచి ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

కోర్సులకు ఆదరణ..

ఐటీఐ కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఈ ఏడాది మే 16 నుంచి జూన్ 14 వరకు తొలి విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కళాశాలలో మొత్తం 312 సీట్లకుగానూ 124 సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో ఎలక్ట్రీషియన్-27 సీట్లు, ఫిట్టర్-17, టర్నర్-08, ఎలక్ట్రానిక్ మెకానిక్-09, మెకానిక్-03, వెల్డర్-18, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా)-11, సోలార్ టెక్నీషియన్-19, ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీ కోర్సుల్లో-12 సీట్లు భర్తీ చేశారు. ఇందులో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫ్యాషన్ డిజైనింగ్, సోలార్ టెక్నీషియన్ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉంది.

మిగులు సీట్లు

మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో మొత్తం 312 సీట్లకు గానూ మొదటిదఫాలో 124 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన 188 సీట్ల భర్తీకిగానూ రెండో దఫాలో ఈ నెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

రెండో విడత నోటిఫికేషన్

పారిశ్రామిక శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఉపాధి శిక్షణ శాఖ రెండోదఫా నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15లోగా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు వెబ్‌ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 1, 2024 నాటికి 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు మాత్రమే ఈ కోర్సులు అభ్యసించేందుకు అర్హులు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, టర్నర్, మిషనిస్టు, కోపా తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్నా సీటు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదని, కొత్తగా వెబ్‌ఆప్షన్ మాత్రమే ఇచ్చుకోవాల్సి ఉంటుందని మంచిర్యాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. మెరిట్, రిజర్వేషన్, అభ్యర్థి ఎంచుకున్న కోర్సును బట్టి సీట్ల కేటాయిస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు htpp//. telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏటీసీతో ఆరు కొత్త కోర్సులు

ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తూ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుతో మరిన్ని కొత్త కోర్సులు రానున్నాయి. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఏటీసీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. దాదాపు రూ.5కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నారు. కొత్త కోర్సులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అడ్వాన్స్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్-48, ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్స్, టూల్-20, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్-48, ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్-40, మ్యాను ప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్-40, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్-48 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది నుంచి కోర్సులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

బుయ్యారంలో భూ వివాదం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు

వేమనపల్లి: బుయ్యారంలో నెలకొన్న భూ వివాదంలో అన్నదమ్ముళ్ల మధ్య గొడవ తారాస్థాయికి చేరింది. ఇరువర్గాలకు జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా దాడికి పాల్పడిన ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. జిల్లెడ గ్రామ శివారులోని సర్వే నం.94లో బైరి వెంకాగౌడ్ కుటుంబానికి పదెకరాల పట్టా భూమి ఉంది. అతని కుమారుడు లస్మాగౌడ్ పేరు మీద కొంత భూమి గతంలో విరాసత్ పట్టా అయింది. లస్మాగౌడ్ కుమారులైన వెంకాగౌడ్, తిరుపతిగౌడ్‌లకు వారసత్వంగా భూమి దక్కాల్సింది. కానీ ఈ భూమిలో నుంచి వెంకాగౌడ్ ఐదెకరాలు పట్టా చేయించుకున్నాడు. ఈ భూమిలో వారసత్వంగా తనకు వాటా ఉందని తిరుపతిగౌడ్ అడ్డుతగులుతూనే ఉన్నాడు. వారం రోజులుగా ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతోంది. శనివారం ఇరువర్గాలు ట్రాక్టర్లతో భూమి వద్దకు వెళ్లి దున్నేందుకు ప్రయత్నించగా తిరుపతిగౌడ్, అతని భార్య రేణుక, కొడుకు శ్రావణ్‌కుమార్‌లు వెంకాగౌడ్, అతని కొడుకు మణిదీప్‌లపై కర్రలతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంకాగౌడ్ ఫిర్యాదు మేరకు తిరుపతిగౌడ్, రేణుక, శ్రావణ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



ఆస్పత్రిలో వెంకాగౌడ్

14న బీఎంఎస్ మహాసభ



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: ఈ నెల 14న బీఎంఎస్ 28వ ద్వైవార్షిక మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శనివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించనున్న సభకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్‌గురుడే, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా బీఎంఎస్ నిర్మాణం, కార్మికుల హక్కులు, సదుపాయాలపై చర్చిస్తామన్నారు. సింగరేణి కార్మికులకు కోలిండియాలో ఇస్తున్నట్లు పెర్క్స్‌పై ఆదాయపన్నును రాష్ట్ర ప్రభుత్వమే రీయింబర్స్‌మెంట్ చేయాలని, బెల్లంపల్లి, రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం ఏరియాల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలని, కార్మికుల పిల్లల కోసం కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, గూడ శ్రీకాంత్, దొంతుల రాజేంద్రప్రసాద్, సతీశ్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్‌రూరల్: పెద్దపులి సంచరిస్తున్నందువల్ల పట్టణ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్‌వో రమాదేవి సూచించారు. పట్టణ సమీప గ్రామాలైన అంకుసాపూర్, నందిగూడ, నార్లాపూర్, గోంది, దరిగాం, చారిగాం, కోసిని, రేగులగూడ, ఊట్‌పల్లి, వేంపల్లి గ్రామాల ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదన్నారు. పులి కదలికలు, పాదముద్రలులాంటి ఏమైనా ఆధారాలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

కెరమెరి: మండలంలోని పెద్ద కరంజీవాడలో శనివారం పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. బేల మండలంలోని దుబ్బగూడెంకు చెందిన కొడప మారుతి (32) కెరమెరి మండలం లోని పెద్ద కరంజీవాడకు చెందిన రాథోడ్ టికరం వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో గొడవలు తలెత్తడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య మీరాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



మారుతి మృతదేహం

చికిత్స పొందుతూ మరొకరి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గజ్జిగూడకు చెందిన చిలుకూరు లక్ష్మి (21) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ కలహాలతో ఈ నెల 1న తల్లీకూతుళ్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఈనెల 3న తల్లి అనిత (45), కూతురు రమ్య (16) మృతి చెందిన విషయం తెలిసిందే. మెరుగైన చికిత్స నిమిత్త లక్ష్మి, ఐశ్వర్యలను మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా లక్ష్మి (21) శనివారం మృతి చెందినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు తెలిపారు.



లక్ష్మి (ఫైల్)

బొలెరో బోల్తా..

- ఐదుగురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గుట్ట ఎక్కుతున్న క్రమంలో శనివారం బొలెరో వాహనం బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు మడె సునీత, మడె కాజల్, దుర్గం పావని, గౌరారం శంకరమ్మ, కొండ శ్రావణికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లెడ గ్రామానికి చెందిన గౌరారం రామన్న బెజ్జూర్ నుంచి బొలెరో వాహనంలో ఎరువుల బస్తాలు, సిలిండర్లు, సిమెంట్ రేకులు, నిత్యావసర సరుకులతో పాటు బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు, తల్లిదండ్రులను ఎక్కించుకుని గ్రామానికి బయలుదేరాడు. వాహనం మురళీగూడ గుట్ట ఎక్కుతున్న క్రమంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన విద్యార్థిని

అందుబాటులో లేని 108...

ప్రమాద సంఘటన ప్రాంతంలో సిగ్నల్స్ లేక పోవడంతో జిల్లెడ గ్రామానికి చెందిన పలువురు యువకులు 108 అంబులెన్సు కోసం ఫోన్ చేయగా మహారాష్ట్ర అంబులెన్సు వారికి సమాచారం చేరింది. అత్యవసర సమయంలో మండలంలో 108 అందుబాటులో లేక పోవడంతో ప్రైవేటు వాహనంలోనే గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఆస్నాద భూముల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో పది రోజులుగా పట్టా భూముల విషయంలో నెలకొన్న వివాదాన్ని రైతులు శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ దృష్టికి తీసుకుకెళ్లారు. శనివారం అటవీశాఖ అధికారులు డీఎఫ్‌వో శివ ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవో రమేశ్, ఎఫ్‌ఆర్‌వో శివకుమార్ గ్రామానికి వెళ్లి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు వివరించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపినట్లు రైతులు తెలిపారు.

మాఫియా మంచిర్యాలగా మారుస్తున్నారు..

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అనుచరులు, బంధువులు మంచిర్యాలను మాఫియా మంచిర్యాలగా మారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత ఐదేళ్లలోపు వందల కోట్లు సంపాదించుకునే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెట్టుకున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేవలం అభివృద్ధిని మాత్రమే ప్రజలకు వివరించానని, ఎవర్నీ విమర్శించలేదన్నారు. ప్రజలంతా ఏకమై ఎమ్మెల్యే చేస్తున్న అన్యాయాలను అడ్డుకోవాలని, అన్యాయం జరిగిన వారికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ యెర్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

- 50.10 శాతం ఉత్తీర్ణత



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈఏడాది ఏప్రిల్, మేలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీవోకేషనల్ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి విడుదల చేశారు. పరీక్షలకు 46,130 మంది విద్యార్థులు హాజరుకాగా 23,114 మంది (50.10)శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలురు 22,355 మంది హాజరుకాగా 8,465 మంది (37.87శాతం), బాలికలు 23,784 మంది హాజరుకాగా 14,649 మంది (61.59శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు

కేయూ పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ల పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18,881 మంది విద్యార్థులకుగానూ 9,657 మంది (51.15) ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకుగానూ 6,352 మంది (53.79శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,449 మంది విద్యార్థులకుగానూ 7,105 మంది (45.99శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 7నుంచి 22వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్పాలన్నీ విషపూరితమైనవి కావు

కాసిపేట: అన్ని సర్పాలు విషపూరితమైనవి కావని ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అటవీశాఖ అధికారులు, స్నేక్ సొసైటీ సభ్యులతో కలిసి వివిధ రకాల విషపూరిత, విషపూరితం కాని సర్పాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పాలు అంతరిస్తే రైతుల ధాన్యం పాడు చేసే ఎలుకలు, కీటకాల సంఖ్య పెరుగుతుందన్నారు. నాగుపాము, జెర్రీ పోతు, రక్తపింజర, నీరుకట్టె, రెండు తలల పాములను ప్రదర్శిస్తూ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్, స్నేక్ సొసైటీ సభ్యులు రాకేష్, ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, అధికారులు గౌరిశంకర్, ప్రభాకర్, శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు.



వివరిస్తున్న స్నేక్ సొసైటీ సభ్యుడు

నకిలీ వైద్యుల క్లినిక్‌లు తనిఖీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తమకు అందిన సమాచారం మేరకు శనివారం టీజీఎంసీ ఎథికల్, యాంటి క్వాకరీ బృందం సభ్యులు నకిలీ వైద్యుల క్లినిక్‌లను తనిఖీ చేసినట్లు కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్, కో ఆప్షన్ మెంబర్ డాక్టర్ సంతోశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్‌లోని జనకపురి కీర్తి క్లినిక్, వివేకానంద చౌక్‌లోని శ్రీలక్ష్మీ సాయి క్లినిక్, మార్కెట్ రోడ్డులోని ధనలక్ష్మీ ఫార్మసీ పక్కన, బెల్లంపల్లిలోని మనీష్ క్లినిక్‌లను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. కొందరు వైద్యులుగా చలామణి అవుతూ అవసరం లేకున్నా మోతాదుకు మించి స్టెరాయిడ్, యాంటి బయోటిక్, నొప్పి మందులు, ఇతర హై షెడ్యూల్ మందులు ఇస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాంటి వారిపై ఎన్ఎంసీ చట్టాల ప్రకారం ఏడాది జైలు, రూ.5 లక్షల జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాలలోని మూడు ఆస్పత్రుల వైద్యులకు మెమోలు ఇవ్వడం జరిగిందని, మార్పురాకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.



బెల్లంపల్లిలో తనిఖీ చేస్తున్న సభ్యులు

కుర్రేఘడ్‌లో అకాడి సంబరాలు షురూ

కాసిపేట: మండలంలోని మారుమూల గ్రామమైన కుర్రేఘడ్‌లో శనివారం ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అకాడి సంబరాలు జరుపుకున్నారు. తొలి పండుగను పురస్కరించుకుని అడవితల్లికి పూజలు నిర్వహించారు. పొలిమేరలో చెట్టుకింద ఉన్న రాజుల్‌పేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేసి కోడి పంచాంగం, పాడిపంటలు బాగుండాలని లక్ష్మణరేఖ లాంటి గీత గీసి తుర్రను ఊదుతూ పశువులను గీత దాటించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వల్క శ్రీను, కుర్సింగ భూదేశవ్, పెందూర్ ప్రభాకర్, కుర్సింగ మాధవరావ్, వల్క రాము, లచ్చు, ఈస్రు, బదిరావ్, తదితరులు పాల్గొన్నారు.



అడవితల్లికి పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

బొగ్గు పెల్లకూడా తీయనీయం

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థకు నష్టం కలిగేలా బొగ్గు గనుల వేలం వేసి ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే బొగ్గు పెల్ల కూడా తీయనీయమని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు అన్నారు. శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలన్నారు. కేంద్రం సింగరేణికి నష్టం చేసేలా శ్రావణ్‌పల్లి బొగ్గు గనిని వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులు సింగరేణి రక్షణ కోసం మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నేతలు

బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

మంచిర్యాలక్రైం: బెదిరింపులకు పాల్పడుతూ భూకబ్జాకు యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీసీసీ నస్పూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆచి వెంకటరమణ చారి మంచిర్యాలలోని గర్మిళ్ల శివారులో 2000 సంవత్సరంలో 39 గుంటల భూమిని తన భార్య పేరు మీద కొనుగోలు చేసి మ్యూటేషన్ చేయించుకున్నాడు. 39 గుంటల భూమిని ప్లాట్స్‌గా మార్చి 600 గజాల భూమిని తన ఆధీనంలో ఉంచుకుని మిగతా భూమిని విక్రయించాడు. అట్టి భూమిని స్థానిక తిలక్ నగర్‌కు చెందిన చిప్పకుర్తి జగన్, మల్లేష్, నారాయణ కాజేయాలని బెదిరింపులకు పాల్పడడంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. అయినా వారు తమ పద్ధతి మార్చుకోకుండా బెదిరింపులకు పాల్పడుతుండడంతో ప్రత్యేక పోలీసులు చిప్పకుర్తి జగన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మల్లేశ్, నారాయణ పరారీలో ఉన్నారని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు



మాట్లాడుతున్న డీఏవో సురేఖ

చెన్నూర్‌రూరల్: నియమ నిబంధనలు పాటించని ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లపై చర్యలు తీసుకుంటామని డీఏవో సురేఖ అన్నారు. శనివారం కిష్టంపేట రైతు వేదికలో చెన్నూర్ డివిజన్‌లోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మాలని, తప్పని సరిగా బిల్లులు అందజేయాలని సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారులకు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఏడీఏ రాజేశం, ఏవోలు పాల్గొన్నారు.

బిల్లులు ఇప్పించండి సారూ..

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ వద్ద 50 రోజుల పాటు విద్యుత్ దీపాలు, కూలర్లు, మైక్ సెట్‌లు, వైరింగ్, జనరేటర్లు, ఫ్యాన్లు అమర్చినందుకు తనకు రావాల్సిన రూ.9 లక్షల బిల్లులు ఇప్పించాలని ఎలక్ట్రీషియన్ పాయిరాల బాపు కోరుతున్నాడు. శనివారం బిల్లుల పత్రాలను చూపిస్తూ తన ఆవేదన వెలిబుచ్చారు. ప్రతి రోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి స్పందించి వెంటనే బిల్లులు ఇప్పించాలని కోరుతున్నాడు.



బాధితుడు బాపు